క్లుప్తంగా

రాజకీయాల్లో ఉన్నంత వరకూ జగనన్నతోనే..



మాట్లాడుతున్న గౌరి

నెల్లూరు(బారకాసు): తాను రాజకీయాల్లో కొనసాగినంత కాలం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తోనే ఉంటానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగ జిల్లా అధ్యక్షురాలు, 21వ డివిజన్ కార్పొరేటర్ గౌరి పేర్కొన్నారు. ఈ మేరకు తన నివాసంలో సాక్షితో గురువారం ఆమె మాట్లాడారు. తన కుటుంబానికి దివంగత సీఎం వైఎస్సార్ అంటే మొదట్నుంచి ఎంతో అభిమానమన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని జగన్‌మోహన్‌రెడ్డి స్థాపించిన నాటి నుంచి తమ వంతుగా పార్టీ కోసం కృషి చేస్తున్నామని చెప్పారు. పార్టీలో తాను పనిచేస్తున్నందుకు ఎంతో గర్వపడుతున్నానని తెలిపారు. పార్టీ కోసం తాను చేస్తున్న కష్టాన్ని చూసి కార్పొరేటర్‌గా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అవకాశం కల్పించారని, ఆయనంటే ఎంతో అభిమానమని.. అయితే అంతకు ముందు నుంచే వైఎస్సార్ కుటుంబం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అంటే ఎంతో ఇష్టమని తెలిపారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

పన్నులను వసూలు చేయండి



మాట్లాడుతున్న హరిత

నెల్లూరు సిటీ: నగరపాలక సంస్థ పరిధిలో ఏర్పాటు చేసిన వాణిజ్య ప్రకటనల ప్రదర్శన పన్నులను వేగవంతంగా వసూలు చేయాలని కమిషనర్ హరిత పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో టౌన్‌ప్లానింగ్ అధికారులతో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. 2016 నుంచి ప్రకటనల పన్నుల బకాయిలను పూర్తిస్థాయిలో వసూలు చేయాలని ఆదేశించారు. భారీ హోర్డింగులను నిబంధనల మేరకు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. టౌన్‌ప్లానింగ్ విభాగంలో కోర్టు కేసుల పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని సూచించారు.

సమస్యలపై మాట్లాడటం తప్పా..?

నెల్లూరు(బారకాసు): వెంకటగిరి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై వివిధ సమావేశాల్లో తాను మాట్లాడటం తప్పంటే ఎలా అని ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి ప్రశ్నించారు. నగరంలోని తన నివాసంలో విలేకరులతో గురువారం ఆయన మాట్లాడారు. 40 ఏళ్లుగా తాను ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్నానన్నారు. బయటి వ్యక్తులు ఎన్ని మాట్లాడినా వేరని.. సొంత తమ్ముడే ప్రెస్‌మీట్‌లో తన బిడ్డ ప్రస్తావన తీసుకురావడం, కుటుంబాన్ని విమర్శించడం దారుణమన్నారు. తనను విమర్శించే వారు, తనపై ఆరోపణలు చేసే వారు ఏదో ఒక రోజు తమ తప్పును తెలుసుకుంటారని చెప్పారు.

అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు రేపు

నెల్లూరు(వేదాయపాళెం): జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు ఆయా ఆర్డీఓ కార్యాలయాల్లో ఇంటర్వ్యూలను శనివారం ఉదయం పది గంటలకు నిర్వహించనున్నామని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారి సౌజన్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు నెల్లూరు, ఆత్మకూరు, కావలి, కందుకూరు ఆర్డీఓ కార్యాలయాల్లో నిర్వహించనున్న ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు. సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్న రసీదు, ఒరిజినల్ సర్టిఫికెట్లను తీసుకురావాలని సూచించారు.

'డీకేడబ్ల్యూ'లో సర్టిఫికెట్ కోర్సు

నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో మేనేజ్‌మెంట్ ఆఫ్ వర్మికంపోస్ట్ అనే అంశంపై 30 రోజుల సర్టిఫికెట్ కోర్సును ఈ నెల ఆరున ప్రారంభించనున్నామని ప్రిన్సిపల్ గిరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు 93924 87705 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఐసీడీఎస్‌కు చిన్నారి అప్పగింత



నెల్లూరు(అర్బన్): ఆడపిల్ల పుట్టడంతో పెద్దాస్పత్రిలో వదిలి తల్లిదండ్రులు వెళ్లిపోయారు. ఈ క్రమంలో బిడ్డను అక్కున చేర్చుకొని పెద్దాస్పత్రి నర్సులు, వైద్యులు కాపాడారు. అనంతరం బిడ్డను ఐసీడీఎస్ అధికారులకు జాగ్రత్తగా అప్పగించారు. వివరాలు.. చిత్తూరు జిల్లా బత్తలవరం - చెదులపాకానికి చెందిన సంధ్య, గణేష్ దంపతులు. కాన్పు నిమిత్తం దర్గామిట్టలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ప్రసూతి విభాగంలో సంధ్య చేరారు. డిసెంబర్ ఏడున డాక్టర్లు ఆమెకు నార్మల్ డెలివరీ చేశారు. ఆడపిల్లకు సంధ్య జన్మనిచ్చారు. బిడ్డ తక్కువ బరువు ఉండటంతో ఇంక్యుబేటర్‌లో ఉంచారు. అయితే మరుసటి రోజు బిడ్డను వదిలి వారు పరారయ్యారు. వారు ఎంతకీ రాకపోవడంతో ఐసీడీఎస్ బాలల సంరక్షణ కేంద్రానికి అప్పగించారు. చిన్నపిల్లల విభాగ హెచ్‌ఓడీ మనోహర్, నోడల్ ఆఫీసర్ శివరాముడు, డాక్టర్లు హేమంత్‌కుమార్, ప్రవీణ్, రాజశేఖర్, శ్రీకాంత్, శిశుగృహ బాధ్యురాలు లక్ష్మి పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్‌కు ఎంపిక

నెల్లూరు (టౌన్): డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో 2022 - 23 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఆరో సెమిస్టర్ విద్యార్థినులకు నెల్లూరులోని కేవీకేలో 90 రోజుల పాటు ఇంటర్న్‌షిప్ చేసేందుకు అనుమతి మంజూరైందని ప్రిన్సిపల్ గిరి తెలిపారు. 41 మంది విద్యార్థినులు హాజరుకానున్నారని పేర్కొన్నారు.

నా భర్త ఆచూకీ తెలపండి

- సీసీఎస్ పోలీసులను అభ్యర్థించిన వివాహిత

నెల్లూరు(క్రైమ్): తన భర్త ఆచూకీ చెప్పాలంటూ నెల్లూరు రూరల్ మండలం ఉప్పుటూరుకు చెందిన శైలజ తన కుటుంబసభ్యులతో కలిసి గురువారం సీసీఎస్ పోలీసులను అభ్యర్థించారు. బాధితురాలి వివరాల మేరకు శైలజ భర్తను సీసీఎస్ పోలీసులు ఇటీవల అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ప్రతి రోజూ ఆమె దుస్తులు, భోజనం అతనికి ఇచ్చివెళ్లేది. విచారణలో భాగంగా అతనిని సీసీఎస్ పోలీసులు బుధవారం ఏఎస్‌పేట, సంగం తీసుకెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఆయన సంగం వద్ద పోలీసుల కళ్లుగప్పి కారు డోరు తీసుకుని పక్కనే ఉన్న వాగులో దూకేశాడని సమాచారం. ఈ విషయం గురువారం వెలుగులోకి రావడంతో శైలజ తన కుటుంబసభ్యులతో కలిసి రూరల్ పోలీసుస్టేషన్‌కు చేరుకుని తన భర్త కనిపించడం లేదంటూ ఫిర్యాదు చేసింది. అనంతరం సీసీఎస్ పోలీసుస్టేషన్‌కు చేరుకుంది. తన భర్త ఆచూకీ తెలియజేయాలని సీసీఎస్ సిబ్బందిని ప్రాధేయపడింది. అతనికి ఏదైనా జరిగితే తనకు తన పిల్లలకు ఆత్మహత్యే శరణ్యమని కన్నీటి పర్యంతమైంది.

నేత్రదానం

నెల్లూరు(అర్బన్): నెల్లూరు రూరల్ మండల పరిధిలోని ములుమూడికి చెందిన కామేశ్వరమ్మ (60) తన నివాసంలో గురువారం మృతి చెందారు. కుటుంబసభ్యుల అంగీకారంతో ఆమె నేత్రాలను ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి నేత్రదాన మోటివేటర్ బాలాజీ సింగ్, ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ లాలేష్ సేకరించారు. అనంతరం కుటుంబసభ్యులకు సర్టిఫికెట్‌ను అందజేశారు. నేత్రదానం చేయాలనుకునే వారు 99481 64781, 93471 11033 నంబర్లను సంప్రదించాలని బాలాజీసింగ్ కోరారు. చిరంజీవి బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి అన్యాయం

నెల్లూరు(వేదాయపాళెం): కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి తగిన నిధులను కేటాయించకుండా తీరని అన్యాయం చేశారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సిరాజ్ ఆరోపించారు. సంతపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో గురువారం ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి నిధుల కేటాయింపులో మొండిచేయి చూపారని ధ్వజమెత్తారు. కేంద్ర వైఖరిని ఖండించారు. నేతలు షానవాజ్, మధు, వెంకటేశ్వర్లు, రఫీ పాల్గొన్నారు.

పౌష్టికాహారానికి విరాళం

నెల్లూరు రూరల్: అల్లీపురంలోని జెడ్పీ హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం వేళ నిర్వహిస్తున్న అదనపు తరగతుల్లో పౌష్టికాహారాన్ని అందజేసేందుకు గానూ రూ.20 వేల విరాళాన్ని ఇసనాక సుందరరామిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీనివాసులురెడ్డి ప్రకటించారు. పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో చెక్కును ప్రధానోపాధ్యాయుడు నారాయణరావుకు అందజేశారు.

క్రైమ్ కార్నర్

బంగారంతో వ్యక్తి ఉడాయింపు

నెల్లూరు(క్రైమ్): బంగారు దుకాణంలో నమ్మకంగా పనిచేస్తూ బంగారంతో వ్యక్తి ఉడాయించిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. పొగతోటకు చెందిన వరుణ్ మండపాలవీధిలో జ్యువెలరీ షాపును నిర్వహిస్తున్నారు. ఆయన వద్ద రబ్బానీ 2007 నుంచి క్లర్క్‌గా పనిచేస్తూ ఎంతో నమ్మకంగా ఉండసాగారు. గత నెల 30న షాపు యజమాని 700 గ్రాముల బంగారాన్ని మనోజ్ బట్టీ షాపులో ఇవ్వాలని రబ్బానీకి అందజేశారు. ఇదే అదునుగా భావించిన రబ్బానీ బంగారంతో ఉడాయించారు. గంటలు గడుస్తున్నా దుకాణానికి రబ్బానీ రాకపోవడంతో వరుణ్‌కు అనుమానం వచ్చింది. ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో బట్టీ వద్దకు వెళ్లి విచారించారు. అక్కడికి రాలేదని తేలడంతో రబ్బానీ కోసం గాలించారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

కూల్‌డ్రింక్స్ షాపు ధ్వంసం

నెల్లూరు(క్రైమ్): డబ్బులివ్వమని అడిగినందుకు గానూ కూల్‌డ్రింక్స్ షాపులోని వస్తువులను ధ్వంసం చేయడంతో పాటు నిర్వాహకులను అసభ్య పదజాలంతో దూషించిన ఇద్దరిపై నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నవాబుపేటలోని శ్రీరంగరాజపురానికి చెందిన మస్తానమ్మ, వెంకటేశ్వర్లు దంపతులు ఆత్మకూరు బస్టాండ్ సమీపంలోని ఓ బార్ వెనుక వైపు కూల్‌డ్రింక్స్ షాపును నిర్వహిస్తున్నారు. గత నెల 29వ తేదీ రాత్రి సత్యనారాయణపురానికి చెందిన రాఘవ, ప్రవీణ్ అక్కడికి వచ్చి కూల్‌డ్రింక్స్, చిప్స్ ఇవ్వాలని కోరారు. డబ్బులివ్వాలని ఆమె అడగ్గా, తమనే అడుగుతావా అంటూ సదరు వ్యక్తులు కూల్‌డ్రింక్స్ షాపులోని వస్తువులను ధ్వంసం చేశారు. అసభ్య పదజాలంతో దూషించారు. స్థానికులు రావడాన్ని గమనించిన నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ మేరకు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కను ఎందుకు కొడుతున్నారన్నందుకు దాడి

నెల్లూరు(క్రైమ్): కుక్కను ఎందుకు కొడుతున్నారని ప్రశ్నించిన మహిళపై కొందరు దాడి చేసి గాయపర్చారు. పోలీసుల సమాచారం మేరకు.. ఎఫ్‌సీఐ కాలనీలోని వాటర్ ట్యాంక్ సమీపంలో పావని తన తల్లి ప్రేమకుమారితో కలిసి నివాసం ఉంటున్నారు. నెల రోజులుగా కుక్కను ఆమె పెంచుకుంటున్నారు. కుక్కను గురువారం బయటకు వదలగా, వారి ఇంటికి ఎదురుగా ఉంటున్న రవి కర్రతో దాన్ని కొట్టబోయారు. ఇంతలో బయటకెళ్లిన పావని ఆయన్ను ప్రశ్నించారు. దీంతో రవి రాయి విసరడంతో ఆమె భయపడి ఇంట్లోకి వెళ్లి తలుపులేసుకున్నారు. కొద్దిసేపటి అనంతరం రవి, మరికొందరు ఆమె ఇంటి తలుపులను పగలగొట్టి కర్రతో దాడి చేశారు. ఘటనలో గాయపడిన బాధితురాలు నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై తిరుపతయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్యకు వేధింపులు

నెల్లూరు(క్రైమ్): భార్యను వేధింపులకు గురిచేస్తున్న భర్త, అతనికి సహకరిస్తున్న అత్తింటివారిపై సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. మాగుంటనగర్‌కు చెందిన కిషోర్ ఆటో నడుపుకొని కుటుంబాన్ని పోషిస్తున్నారు. బుజ్జమ్మ రేవుకు చెందిన ఓ మహిళతో ఏర్పడిన పరిచయం సాన్నిహిత్యానికి దారితీసింది. దీంతో రెండేళ్లుగా ఆమెతో వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తూ భార్య కాంచన, పిల్లలను పట్టించుకోవడం మానేశారు. ఆమెతోనే ఉంటూ సంపాదించిన మొత్తాన్ని ఇవ్వసాగారు. దీంతో సదరు మహిళ ఇంటి వద్దకు కాంచన వెళ్లి భర్తను పంపాలని కోరారు. దీనికి నిరాకరించడంతో పాటు గొడవకు దిగారు. దీంతో భర్త విషయాన్ని అత్తింటివారికి కాంచన తెలియజేశారు. న్యాయం చేయాల్సిన వారు అందుకు భిన్నంగా అతనికే వత్తాసు పలికారు. అందరూ కలిసి ఆమెను చిత్రహింసలకు గురిచేయసాగారు. వేధింపులను తాళలేని కాంచన పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

- వివాహితను వేధింపులకు గురిచేసిన భర్త, అత్తింటివారిపై దిశ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. బుచ్చిరెడ్డిపాళెం మండలం కాగులపాడు పంచాయతీ శ్రీరంగరాజపురానికి చెందిన మాధవి, మనోహర్‌కు 2015లో వివాహమైంది. ఆ సమయంలో మాధవి కుటుంబసభ్యులు రూ.లక్ష నగదు, మూడు సవర్ల బంగారు ఆభరణాలను మనోహర్‌కు ఇచ్చారు. కొంతకాలం వీరి కాపురం సజావుగా సాగింది. అనంతరం కలతలు చోటుచేసుకున్నాయి. భర్త, అత్తింటివారు ఆమెను సూటిపోటి మాటలతో వేధించేవారు. దీంతో ఆమె స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు కౌన్సెలింగ్ చేశారు. భర్త, అత్తింటివారు ఆమెను ఇంటి నుంచి ఇటీవల గెంటేశారు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కులం పేరుతో దూషణ

నెల్లూరు(క్రైమ్): ఆర్థిక లావాదేవీల విషయంలో తల్లీకుమార్తెలను ఓ మహిళ కులంపేరుతో దూషించిన ఘటనపై దర్గామిట్ట పోలీసులు కేసును గురువారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. మాగుంట లేఅవుట్‌కు చెందిన మంజువాణి అదే ప్రాంతంలోని బొటిక్ నిర్వాహకురాలు ప్రేమలతకు ష్యూరిటీ పెట్టారు. ఆమె డబ్బులను చెల్లించకపోవడతో మంజువాణి జీతం నుంచి నగదు కట్ అవుతోంది. ఈ విషయమై ఆమె తన తల్లితో కలిసి ప్రేమలతను అడగ్గా, కులంపేరుతో దూషించారు. బాధితుల ఫిర్యాదు మేరకు అట్రాసిటీ కేసును పోలీసులు నమోదు చేశారు.

ఉయ్యాలకు నిప్పు

నెల్లూరు(క్రైమ్): వరండాలో ఉన్న ఉయ్యాలకు గుర్తుతెలియని దుండగులు నిప్పంటించిన ఘటన అలంకార్ సెంటర్‌లో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. అలంకార్ సెంటర్‌లో నివాసం ఉంటున్న వెంకటనరసింహరావు పని నిమిత్తం తెల్లవారుజామున బయటకెళ్లారు. తలుపును దగ్గరగా వేసిన ఆయన సతీమణి నిద్రించసాగారు. ఈ క్రమంలో అటుగా వెళ్లేవారు వరండాలో ఉన్న ఉయ్యాల తగులబడుతోందని పెద్దగా కేకలేశారు. దీంతో నిద్ర లేచిన ఆమె బయటకొచ్చిచూడగా అప్పటికే ఉయ్యాల పూర్తిగా కాలిపోయింది. ఈ మేరకు చిన్నబజార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సాయితేజ తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఆయనే ఈ ఘటనకు పాల్పడి ఉండొచ్చని బాధితులు అనుమానం వ్యక్తం చేశారు. ఎస్సై సైదులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దాడిపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి గాయపర్చిన ఘటనపై చిన్నబజార్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. పొర్లుకట్టకు చెందిన చెంచుకృష్ణ, మణి, మోషేకు అదే ప్రాంతానికి చెందిన కొందరితో విభేదాలున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల వారిపై పొర్లుకట్ట తూము వద్ద గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. ఘటనలో గాయపడిన చెంచుకృష్ణ, మణి జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సై లతీఫున్నీసా దర్యాప్తు చేస్తున్నారు.